జేసీఎస్ మండల ఇన్‌చార్జిల నియామకం

సాక్షి, తిరుపతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఆ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. తిరుపతి కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని 39 మండలాలకు జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమించింది. వీరు గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులను సమన్వయం చేసుకుని పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గం

రేణిగుంట :	జి.రమేష్
శ్రీకాళహస్తి :	వి.నాగూర్ రెడ్డి
శ్రీకాళహస్తి మున్సిపాలిటీ :	టి.మల్లికార్జున గౌడ్
తొట్టంబేడు :	వై.భక్తవత్సలం
ఏర్పేడు :	కె.తిరుమలయ్య

సత్యవేడు నియోజకవర్గం

బుచ్చినాయుడు కండ్రిగ :	ఎ.భాస్కర్ రెడ్డి
కేవీబీపురం :	కె.శాస్త్రి రాజు
నాగలాపురం :	బి.మోహన్
నారాయణవనం :	కె.బాబు
పిచ్చాటూరు :	జి.తొప్పయ్య
సత్యవేడు :	బి.సోమశేఖర్
వరదయ్యపాళెం :	కె.వెంకటేష్ (చిన్న)

క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



రేణిగుంట: తహసీల్దార్‌గా ఉదయ్‌సంతోష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. ఇక్కడ డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న తహసీల్దార్ భార్గవి మళ్లీ కలెక్టరేట్ డి–సెక్షన్ సూపరింటెండెంట్‌గా వెళ్లారు.

తహసీల్దారుగా శివప్రసాద్



ఏర్పేడు: తహసీల్దారుగా శివప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ద్వారకనాథ్‌రెడ్డి శ్రీకాళహస్తికి బదిలీ అయ్యారు. రేణిగుంట నుంచి శివప్రసాద్ ఆయన స్థానంలో చేరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు ముఖ్యం

సత్యవేడు: కమ్యూనిటీ వైద్యశాలకు వచ్చే రోగులకు డాక్టర్లు మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. గురువారం వైద్యశాలకు నూతన ఇన్‌చార్జి డాక్టర్‌గా సురేష్ బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, డాక్టర్లు, నర్సులు సకాలంలో వైద్యశాలకు హాజరై, విధి నిర్వహణపరంగా అందరి మన్ననలు పొందేలా సేవలు అందివ్వాలన్నారు. గర్భవతులకు మెరుగైన వైద్యం అందించి వైద్యశాలలో ఆపరేషన్ల సంఖ్య పెంచాలని కోరారు. వైద్యశాలలో చిన్న పిల్లల వార్డును పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యశాల కమిటీ మెంబర్లు గోవిందస్వామి, చిన్నబ్బ, మునికృష్ణయ్య, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేంజ్ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం




రమణ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న కార్తిక్

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): అటవీ శాఖలో రేంజ్ డ్రైవర్‌గా రాజంపేటలో పనిచేస్తున్న నక్కా రమణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. గురువారం మృతుడి కుటుంబానికి తొట్టంబేడు అటవీ శాఖలో పనిచేస్తున్న ఏపీ ఫారెస్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సీ.కార్తిక్ ఆధ్వర్యంలో రూ.50 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సాయి, వినోద్, ప్రసాద్, నిరంజన్, విజయ భాస్కర్ పాల్గొన్నారు.

జోరుగా సర్వే

పిచ్చాటూరు: మండల వ్యాప్తంగా గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే జోరుగా చేస్తున్నారు. వలంటీర్లు, గృహ సారథులు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి 12 రకాల ప్రశ్నలు సంధించి, వారికి అవసరమైన ధ్రువపత్రాలను తెలుసుకుని వాటికి అవసరమైన జెరాక్స్‌లను సేకరిస్తున్నారు. సర్వే పూర్తి చేసినట్లు కుటుంబంలో ఒకరి బయోమెట్రిక్, ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. సిద్ధిరాజుకండ్రిగ, గోవర్ధనగిరి గ్రామాల్లో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు మధుసూదన్ రావు సర్వేను పర్యవేక్షించారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం



శ్రీకాళహస్తి: బస్టాండుతోపాటు బస్సులను శుభ్రపరచి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందివ్వాలని ఆర్టీసీ డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం డిపో ఆవరణలో ఆయన పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. మెరుగైన పనితీరు కనబరుస్తున్న కార్మికులను అభినందించారు. కార్యక్రమంలో మెకానికల్ ఫోర్‌మెన్ చక్రవరి, స్టోర్ సూపర్‌వైజర్ రామానుజన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



పరమాలపల్లెలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

ఏర్పేడు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అముదూరు పంచాయతీలోని బండివానిపల్లె, పరమాలపల్లెలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. గ్రామాల్లోని 325 కుటుంబాలను కలిశారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ లబ్ధి గురించి వివరించారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, మురుగునీటి కాలువల నిర్మాణాలు, శ్మశానానికి రోడ్డు సౌకర్యం, తాగునీటి బోర్లు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా జగనన్న అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన సీఎంగా జగనన్న చరిత్ర సృష్టించారన్నారు. పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

ఒకే కుటుంబంలో రూ.30 లక్షల లబ్ధి

పరమాలపల్లెలో ఒకే కుటుంబం 4 ఏళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.30 లక్షలు లబ్ధి పొందినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. గ్రామంలోని పరమాల రాము, పరమాల శారదమ్మ, పరమాల సుధాకర్ రూ.10 లక్షల చొప్పున లబ్ధి పొందారన్నారు.



మృతుడి భార్య శంకరమ్మకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

పరమాలపల్లెలో ఇటీవల సామంతయ్య, పెంచలయ్య మృతి చెందారు. మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శించి రూ.20 వేలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీలు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, సర్పంచ్ సుబ్బమ్మ, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, పార్టీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీలు కూనాటి రమణయ్య, మునిరత్నంరెడ్డి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏకాదశి ఉత్సవంలో కల్యాణ వెంకన్న



గ్రామోత్సవంలో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఏకాదశి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో ఆలయంలో నిత్యపూజా కార్యక్రమాలను అర్చకులు పూర్తి చేశారు. పాలకడలి మదనానంతరం మహావిష్ణువు శయనించిన రోజు నుంచి తెలుగు పండుగలు ప్రారంభమవుతాయని, ఆ రోజునే తొలి ఏకాదశిగా, శయన ఏకాదశిగా కొలుస్తారని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య పేర్కొన్నారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకన్న అధిష్ఠించి మాడవీధుల్లో గ్రామోత్సవంలో భక్తులను అనుగ్రహించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవ మూర్తులకు ఆస్థానం నిర్వహించారు. ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

ద్రౌపదీదేవి పురవిహారం



పురవీధుల్లో ఊరేగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి

శ్రీకాళహస్తి: స్థానిక చెన్నైరోడ్డులోని శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారు పురవిహారం చేశారు. స్వామిఅమ్మవార్లకు విశేష అభిషేకాల అనంతరం ఉత్సవమూర్తులు చప్పరంపై అధిష్ఠించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లకు భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు అర్జున తపస్సు

ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు అర్జునతపస్సు, అర్ధరాత్రి 12గంటలకు అలుగు, కుంభాగ్రం కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

రైతులకు వేరుశనగ, కంది విత్తనాల పంపిణీ



రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు

రేణిగుంట: మండలంలో కరకంబాడి పంచాయతీ వనస్థలిలోని రాస్ కేవీకేలో గురువారం రైతులకు వేరుశనగ, కంది విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు చేతుల మీదుగా, వెదురుకుప్పం మండలం దామరకుప్పానికి చెందిన 100మంది రైతులకు ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం పంపిణీ చేశారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా అధిక దిగుబడినిచ్చే టీసీజీఎస్–1694 రకం వేరుశనగ విత్తనాలు, ఎల్ఆర్‌జీ–105 రకం కంది విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ విత్తనాలను ప్రదర్శన క్షేత్రాల్లో సాగుచేసి వచ్చే దిగుబడిలో మరికొంత మందికి ఇవ్వాలని కోరారు. ఈ పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, మెళుకువలను వివరించారు. అనంతరం ఔషధ మొక్కలు, ఉద్యాన పంటల నర్సరీలు, అజోల్లా, వానపాముల ఎరువుల తయారీ, భూసార పరీక్ష కేంద్రాలను రైతులు సందర్శించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు దివ్య, శ్రీలత, పద్మజ, అనుష, దామరకుప్పం సర్పంచ్ మమత పాల్గొన్నారు.

జనసేన నాయకుల అత్యుత్సాహం



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి: జనసైనికులు అత్యుత్సాహం ప్రదర్శించారు. సబ్‌జైలు నుంచి విడుదలైన తమ నాయకుడిని చూసి ఈలలేస్తూ ఊగిపోయారు. ఆపై పట్టణంలో ర్యాలీచేసేందుకు ఉపక్రమించారు. పోలీసులు వారిస్తున్నా వారిపై తిరగబడడం విమర్శలకు తావిచ్చింది.

అసలేం జరిగిందంటే..!

శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన నాయకురాలు కోట వినుత భర్త కోట చంద్రబాబు ఇటీవల అరెస్ట్ అయ్యారు. ఈ క్రమంలో ఆయన స్థానిక సబ్‌జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. గురువారం ఆయనకు బెయిల్ రావడంతో పెద్ద ఎత్తున జనసైనికులు జెండాలతో సబ్‌జైలుకు తరలివచ్చారు. తమ నాయకుడు విడుదల కాగానే ఈలలేసి, గోల చేశారు. జెండాలు చేతబట్టి నినాదాలు చేశారు. అంతటితో ఆగకుండా అక్కడి నుంచి కారు టాప్ ఓపెన్ చేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించేందుకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ మల్లికార్జున్ వారిని వారిస్తూ 30వ యాక్టు అమలులో ఉందని ఎంత చెప్పినా వినకుండా దురుసుగా మాట్లాడారు. గంటపాటు పోలీసులతో వాగ్వాదానికి దిగడం చర్చనీయాంశమైంది. అధికారులు, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంపై స్థానికులు మండిపడ్డారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



ముస్లింలకు మంచినీళ్ల బాటిళ్లను అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలో గురువారం ఘనంగా బక్రీద్ వేడుకలు నిర్వహించారు. మసీదులు, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, ఎంజీఎం పాఠశాల వద్ద ఉన్న ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, ప్రతి ముస్లిం విధిగా నమాజు చేయాలన్నారు. అల్లాహ్ ప్రబోధించిన మార్గాన్ని అనుసరించాలని, నీతి నిజాయితీతో సాగాలని, హింసా మార్గంలో వెళ్లరాదని, సేవా గుణం కలిగి ఉండాలని హితోక్తులు పలికారు. డిగ్రీ కళాశాల వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. వారికి మంచినీళ్ల బాటిళ్లను అందజేశారు. అల్లా దీవెనలతో ముస్లిం కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మైనారిటీల సంక్షేమానికి నాలుగుశాతం రిజర్వేషన్ కోసం కృషి చేశారన్నారు. దీని వల్ల ఉద్యోగాలకు, విదేశీ చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తండ్రి బాటలోనే ముస్లింల సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, నజీర్, గోరా, జిలాని, అస్లాం, ఫాజిల్, అమీన్, చాంద్‌బాషా, జబ్బర్, జులేషా, హరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాపానాయుడుపేట, ఏర్పేడు, మాధవమాల, పోతుమానిగుంట, మర్రిమంద తదితర గ్రామాల్లో ముస్లిం మత గురువులు, ముస్లింలు ఈద్గాలో ప్రార్థనలు చేశారు. పేదలకు నగదు, అన్నదానం చేశారు.



బుచ్చినాయుడుకండ్రిగ : ప్రత్యేక ప్రార్థనలో మాట్లాడుతున్న మతగురువు

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కాటూరు, బుచ్చినాయుడుకండ్రిగ, నీర్పాకోట, వెస్టువరత్తూరు, గాజులపెళ్లూరులో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. నీర్పాకోట, కాటూరులోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలో ముస్లింపాళెం సమీపంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు ఆధ్యాత్మిక సందేశమిచ్చారు.

ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ సమస్య పరిష్కారం



విద్యుత్ వైర్లు లాగుతున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామ దళితవాడలో ఎన్నో ఏళ్లుగా రెండు వీధులలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో దళితులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీటీసీ సభ్యులు రవి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. ఆయన ఆదేశాలతో ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి గురువారం తమ సిబ్బందితో కలసి దళితవాడలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, వైరు లాగి సమస్యను పరిష్కరించారు. దీంతో దళితులు హర్షం వ్యక్తం చేశారు.

కర్మక్రియల మండపంలో వసతులు కల్పించరూ!

- పాలకమండలి చైర్మన్ అంజూరుకు వినతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని రాఘవేంద్రస్వామి ఆలయం పక్కనే ఉన్న కర్మక్రియల మండపంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని హిందూ ధార్మిక మండలి సభ్యులు కోరారు. గురువారం వారు కర్మక్రియల మండపాన్ని పరిశీలించి, ఇక్కడి సమస్యలపై పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులకు వినతి పత్రం ఇచ్చారు. సభ్యుడు గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల క్రితం కర్మక్రియల మండపంలో పలువురు తమ పితృదేవతలకు పిండ తర్పణం వదులుతారన్నారు. ప్రస్తుతం ఆ మండపం సరిపోవడం లేదని చెప్పారు. సరైన గదులు లేక, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మంచినీటి వసతి కూడా కల్పించాలన్నారు. దీనిపై అంజూరు సానుకూలంగా స్పందించారు. మెరుగైన వసతులు కల్పించే దిశగా కార్యాచరణకు పూనుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాసు యాదవ్, ఢిల్లీకుమార్, వెంకటేష్ ఆచారి, కన్నా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

సత్యవేడు: కొల్లడంలో సింగిల్ విండో అధ్యక్షుడు కేవీ.నిరంజన్ రెడ్డి తండ్రి కే. ప్రభాకర్‌రెడ్డి కర్మక్రియలకు గురువారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీ కన్వీనర్లు అపరంజి రాజు, సుశీల్‌కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, సీఐ ఎస్.శివకుమార్ రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, చిన్నదొరై, పలు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'



జగనన్న సురక్ష అమలుపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- పథకం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపు

పిచ్చాటూరు: గ్రామాల్లో పలు సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం అమలుకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. జగనన్న సురక్షపై గురువారం సాయంత్రం నాగలాపురం మార్కెట్ యార్డులో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, జూలై 1 నుంచి ఆగస్టు 1 వరకు సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నామన్నారు. వరదయ్యపాళెం, సత్యవేడు, కేవీబీ పురంలలో ఎంపీడీఓ, తహసీల్దారు నేతృత్వంలో రెండు బృందాలు శిబిరాలు నిర్వహిస్తాయన్నారు. ఇందుకు షెడ్యూల్ కూడా ఖరారు చేశామన్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల ధ్రువపత్రాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, వీటిని కుల, మత, పార్టీలకు అతీతంగా ఇవ్వాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. సర్వే తుదిదశకు చేరుకుందని, ధ్రువపత్రాలు కోరిన ప్రజలకు టోకెన్లు ఇవ్వాలన్నారు. అలాగే శిబిరాలు ఏర్పాటు చేసే ముందు రోజు సంబంధిత గ్రామాల్లో దండోరా వేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ, మండల కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు, గృహ సారథులు క్రియాశీలకంగా వ్యవహరించి విజయవంతం చేయాలని కోరారు.

ముగ్గురు స్పెషలాఫీసర్ల నియామకం

జగనన్న సురక్ష పథకం అమలుకు సత్యవేడు నియోజకవర్గానికి ప్రభుత్వం ముగ్గురు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. పిచ్చాటూరు, నాగలాపురం, నారాయణవనం మండలాలకు డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీపురం మండలాలకు డీఈఓ వి.శేఖర్, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు డీడీ సోషల్ వెల్ఫేర్ అధికారి చిన్నయ్యను నియమించారన్నారు. నెల పాటు వీరు కార్యక్రమం అమలును పర్యవేక్షిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, పళ్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏఎం బాలాజీ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాజా, ఏఎంసీ డైరెక్టర్లు కులశేఖర్ రెడ్డి, అలగేశన్, ట్రేడ్ యూనియన్ చైర్మన్ ఎస్ఎం సురేష్, నాయకులు శ్యామ్, దేశన్, ఉదయ్‌కుమార్ రెడ్డి, మురళీ రెడ్డి, ఆనంద్, తేజ రెడ్డి, మోహన్ మొదలి, రోసయ్య, డానియేల్, జేమ్స్, దేశప్పన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిమజ్జనంతో ముగిసిన గంగ జాతర



నీరువాయిలో గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



నరసరాజు అగ్రహారంలో కొలువైన గంగమ్మ

పిచ్చాటూరు: మండలం నీరువాయిలో ఐదు రోజుల గంగ జాతర గురువారం సాయంత్రం నిమజ్జనంతో ముగిసింది. బుధవారం అర్ధరాత్రి భారీ పుష్పాలంకరణ చేసి అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణం అంతా తిరిగి గురువారం ఉదయం 9 గంటలకు నడి వీధిలో గంగమ్మను కొలువుదీర్చారు. వివిధ రూపాల్లో భక్తులు మొక్కులు చెల్లించారు. సాయంత్రం కుంభాన్ని గ్రామ పెద్దలు, మహిళలు ఊరేగింపుగా తీసుకొచ్చి నైవేద్యంగా సమర్పించారు. వివిధ వేషధారణలతో భక్తులు ఆకర్షించారు. ఏర్పాట్లను ఆలయ సర్పంచ్, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

గంగమ్మ సేవలో ఎమ్మెల్యే ఆదిమూలం

గురువారం ఉదయం జాతర వేడుకల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, నాగలాపురం మండల వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ అపరంజిరాజు, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, వైస్ ఎంపీపీ నాగభూషణమ్మ, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, శోభన్, రామగిరి ఆలయ చైర్మన్ వెంకటేశన్, మాజీ వైస్ ఎంపీపీ పాల పద్మనాభం, నాయకులు మోహన్, వెంకటేష్, అలగేశన్, సీఐ సురేష్ బాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర

సత్యవేడు: మండలంలోని నరసరాజు అగ్రహారం, కన్నావరంలో గంగ జాతర వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కన్నావరంలో గంగమ్మను దర్శించుకున్నారు. నరసరాజు అగ్రహారంలో బుధవారం అర్ధరాత్రి ప్రారంభమైన గంగమ్మ ఊరేగింపు గురువారం ఉదయం 7గంటల వరకు సాగింది. భక్తులు మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఎంపీపీ వి.ప్రతిమ, మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏఎం బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ పథకాలు



ఫోన్ యాప్‌లో సమస్యలను అప్‌లోడ్ చేస్తున్న కంచనపుత్తూరు గ్రామ కార్యదర్శి

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కంచనపుత్తూరు గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ అన్నారు.గురువారం ఆమె కంచనపుత్తూరులో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులతో కలసి ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు. సమస్యలను ఫోన్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వప్న పాల్గొన్నారు.

మహావిష్ణువు, లక్ష్మీదేవిల చిద్విలాసం



అలరించిన 'గోపికా కృష్ణులు'

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : శ్రీకాళహస్తి–చెన్నైరోడ్డులోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో గురువారం రాత్రి తొట్టంబేడులోని ఎస్వీపీ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన 'లక్ష్మీ నారాయణుడు',' గోపికా కృష్ణులు', ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహావిష్ణువుగా సాహిత్య, లక్ష్మీదేవిగా హాస్యప్రియ, కృష్ణుడుగా వేదశ్రీ, రాధగా తేన్‌ముళి, గోపికలుగా ప్రతిభ, జీవిత, చామంతి, భూమిక, హాసిని తమ ఆహార్యం, అభినయంతో ఆకట్టుకున్నారు. హిందూధర్మం ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాలు ప్రదర్శించారు. అలాగే బుధవారం రాత్రి అష్టలక్ష్ములు, అంతకుముందు నవదుర్గలు ప్రదర్శించారు.

